## ఆధారాలు చూపించిన వారికి నగదు చెల్లింపులు

మేడ్చల్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల నేపథ్యంలో పట్టుబడి స్వాధీనం చేసుకున్న నగదుకు తగిన ఆధారాలు చూపించిన వారికి జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ద్వారా నగదును అందిస్తున్నారు. రూ.50 వేల పైచిలుకు నుంచి రూ.10 లక్షల వరకు గ్రీవెన్స్ కమిటీ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సరైన ఆధారాలు ఉన్నట్లయితే నగదు తిరిగి ఇచ్చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు రూ.3,49,92,410కోట్లను తనిఖీలలో 104మంది నుంచి స్వాధీనం చేసుకున్నారు. 70 మందికి సంబంధించి ఆధారాలు, ధ్రువపత్రాలు సమర్పించిన క్రమంలో విచారణ చేపట్టి రూ.2,11,80,761 కోట్ల నగదు దరఖాస్తుదారులకు అందజేశారు.

## రూ 58.44 లక్షల నగదు సీజ్

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఏర్పాటుతో అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో భారీ స్థాయిలో నగదు, మద్యం, వస్తువులు పట్టుకున్నారు. బుధవారం రూ.58,44,374 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. ఇప్పటి వరకు రూ.39,56,31,660 నగదును సీజ్ చేసినట్లు చెప్పారు. 334 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 4429 ఆయుధాలను సేకరించినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ద్వారా 277 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశామన్నారు.

## ఎన్నికల బందోబస్తులో.. కేంద్ర బలగాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల బందోబస్తులో భాగంగా రాష్ట్రానికి మొదటి దఫా కేంద్ర సాయుధ బలగాలు వచ్చాయి. ఇందులో భాగంగా ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయి. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ఏడు చొప్పున ప్లాటూన్ల బలగాలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర బలగాలు రంగంలోకి దిగడంతో వారితో కలిసి స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాలలో కవాతు నిర్వహిస్తున్నారు.

## సీబీఆర్‌టీ పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం జరిగే టీఎస్‌పీఎస్సీ 'సీబీఆర్‌టీ' పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీచేశారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షా కేంద్రాల వద్ద 500మీటర్ల దూరం వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ తెలిపారు.

## నగర కొత్వాల్ ఆకస్మిక తనిఖీలు

### నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల కోడ్ అమలుతో పాటు క్షేత్ర స్థాయిలో పోలీసు సిబ్బంది పనితీరును హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య పరిశీలిస్తూ.. పోలీస్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌ఓలకు ఎలాంటి పట్టుందని తెలుసుకోవడంతో పాటు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఎక్కడైనా లోపాలుంటే ఎస్‌హెచ్‌ఓలను బాధ్యులను చేస్తున్నారు. ఇటీవల పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్య బాధ్యతలు తీసుకోగానే జోన్ల వారీగా పోలీసు అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. విధి నిర్వాహణలో ఎలా ఉండాలనే విషయాలపై ఆయన సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా నగర వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో ప్రతి అధికారి పనిచేయాలని సీపీ సూచనలు చేశారు. ఇందులో ప్రధానంగా రౌడీ షీటర్లపై నిఘా పెంచాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. రౌడీషీటర్ విషయంలో బోరబండ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు తీసుకున్నారు.

## దసరా బీర్లకూ ఎన్నికల కోడ్

### 15 బీర్లు కొన్నారని కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 25 : దసరా పండుగ సందర్భంగా స్నేహితులు, బంధువులు ఎక్కువ మంది వస్తారనే ఉద్దేశ్యంతో 15 బీర్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తు పోలీసులకు పట్టుబడడంతో కేసులు నమోదయ్యాయి. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రీన్ బావార్చి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో రహ్మత్‌నగర్‌కు చెందిన రామ్మోహన్‌రావు అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై కాటన్ బీర్లు తీసుకు వెళ్తుండడంతో పోలీసులు ఆపారు. బాక్సులో చూడగా 15 బీర్‌బాటిళ్లు కనిపించాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి లేకుండా ఎక్కువ సంఖ్యలో బీర్ బాటిళ్లు తీసుకువెళ్తున్నారని, కేసు నమోదు చేసి బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఘటనలో నరహరి అనే వ్యక్తి సైతం 15బీర్లను కొనుగోలు చేసి ఇంటికి తరలిస్తూ పట్టుబడటంతో కేసు నమోదు చేశారు. దసరా పండుగ కావడంతో సాయంత్రం ఎక్కువమంది బంధువులు, స్నేహితులు వస్తారని, వారికోసం బీర్లు ముందుగానే కొనుగోలు చేశామంటూ నరహరి చెప్పినా ఎన్నికల కోడ్ కారణంగా కేసు నమోదు చేయాల్సిందేనని పోలీసులు చెప్పి ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

# ప్రతి ఇంటికీ ఓటరు స్లిప్పులు

- సాధ్యమైనంత తొందరగా పంపిణీ చేయాలి
- పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- సమీక్షలో ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్



సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టితో కలిసి రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలైన ర్యాంప్‌లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారి తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో పార్కింగ్ స్థలాన్ని గుర్తించాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్దేశించిన ఓటర్లు దాటిన పక్షంలో పోలింగ్ కేంద్రాల్లో ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత తొందరగా ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని చెప్పారు. రాజకీయ నాయకుల ద్వారా ఓటరు స్లిప్‌లు పంపిణీ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో బీఎల్ఓలపై కఠినంగా వ్యవహరించాలని అర్‌ఓలను ఆదేశించారు. ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేర్లను రీ-చెక్ చేసుకోవడానికి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రానికి సులువుగా చేరే విధంగా రూట్ మ్యాప్‌ను రూపొందించి గూగుల్ మ్యాప్‌లో పొందుపర్చాలని తెలిపారు.

### ఓటు హక్కు వినియోగంపై విస్తృత అవగాహన

ప్రతి పోలింగ్ కేంద్రంలో క్లెయిమ్స్ అండ్ అబ్జక్షన్స్ వేగవంతంగా పూర్తి చేయాలని రొనాల్డ్ రాస్ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) లిస్ట్‌లను బీఎల్ఓ సేకరించి రిటర్నింగ్ అధికారులు రాజకీయ పార్టీల ఏజెంట్లకు సమాచారం అందించాలని తెలిపారు. పోలింగ్ రోజు ఏఎస్‌డీ జాబితాలో ఉన్న ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చినచో సరైన డాక్యుమెంట్లను పరిశీలించి ఓటు హక్కు కల్పించి, ఆ వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రతి ఓటరు ఫోన్ నంబర్లను సేకరించాలని, తద్వారా వారికి ఎస్ఎంఎస్ ద్వారా ఓటు విని యోగించుకోవడానికి సంక్షిప్త సమాచారాన్ని అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఖైరతాబాద్ ఆర్ఓ, జోనల్ కమిషనర్ వెంకటేశ్ దొత్రె, యాకత్‌పుర ఆర్ఓ వెంకటచారి, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్, అడిషనల్ కమిషనర్ ఎలక్షన్స్ శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో.. రసాభాసాగా మారిన చర్చావేదిక

- ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణకు దిగిన బీజేపీ నేత
- ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- పోలీసుల రంగ ప్రవేశంతో ప్రశాంతం
- పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

దుండిగల్, అక్టోబర్ 25 : కుత్బుల్లాపూర్‌లో బుధవారం సాయంత్రం ఓ టీవీ చానల్ ఎన్నికలపై నిర్వహించిన చర్చావేదిక రసాభాసాగా మారింది. ఒక్కసారిగా విపక్షపార్టీల నేతలు ఎమ్మెల్యేతో పాటు స్వర్గీయ తన తండ్రిపై వ్యక్తిగత దూషణలకు దిగడంతో వివేకానంద్ ఆగ్రహావేశానికి గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారంకాలనీ రాంలీలా మైదానంలో ఓ టీవీ చానల్ బుధవారం సాయంత్రం బహిరంగ చర్చావేదికను నిర్వహించింది. దీనికి స్థానిక శాసన సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేపీ వివేకానంద్‌తో పాటు కాంగ్రెస్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ హాజరయ్యారు. వివిధ సమస్యలపై ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ నేతలు అడిగిన ప్రశ్నలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమాధానం ఇచ్చారు. అయితే ఎమ్మెల్యే తండ్రి, దివంగత కేఎం పాండుగౌడ్‌పై శ్రీశైలంగౌడ్ వ్యక్తిగత దూషణలకు దిగాడు. మరణించిన తన తండ్రి కేఎం పాండుపై ఆరోపణలు చేయడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బీజేపీ అభ్యర్థి శ్రీశైలంగౌడ్ చేతుల్లో ఉన్న మైక్‌ను లాక్కొన్ని నెట్టివేయడంతో చర్చావేదిక ఒక్కసారిగా రసాభాసాగా మారింది. వెంటనే చర్చావేదిక నిర్వాహకులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి అక్కడి నుంచి పంపించడంతో సమస్య పరిష్కారం అయ్యింది. అయితే ఈ విషయమై సూరారం పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

## 26, 27న హెచ్‌సీయూలో సదస్సు

కొండాపూర్, అక్టోబర్ 25 : గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజీ అండ్ ఎత్నోలాజికల్ సైన్సెస్ 19వ వరల్డ్ ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఆంత్రోపాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఎం.రొమేశ్ సింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు 'ఆంత్రోపాలజీ అండ్ డిజిటల్ కల్చర్స్' అనే అంశంపై సదస్సు కొనసాగుతుందని చెప్పారు. సదస్సులో 25 ప్యానెళ్లు, 100కుపైగా కార్యకర్తలు, ప్లానర్లు, కన్సల్టెంట్లు, విద్యావేత్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. అక్టోబర్ 26, 27వ తేదీల్లో సదస్సు కొనసాగుతుందని, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, ట్రైబల్ కల్చరల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్మెంట్లు భాగస్వాములుగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

# జనసేన పొత్తుతో కమలంలో టెన్షన్

- గ్రేటర్‌లో జనసేనకు టికెట్లు కేటాయించే అవకాశం?
- ఇప్పటికే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న బీజేపీ ఆశావహులు
- పొత్తు ఓకే అయితే తప్పని త్యాగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమలం పార్టీ శ్రేణులు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ దూకుడు ముందు ప్రతిపక్షాలు డీలా పడుతున్నాయి. ఓ వైపు కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించడానికి జంకుతుంటే మరోవైపు ఈ పార్టీలతో సీపీఐ, జనసేన పొత్తుల విషయంపై చర్చలు సాగుతున్నాయి. అందులో భాగంగానే కమలం పార్టీ- జనసేన పొత్తు దాదాపు ఖరారైనట్లు పార్టీ విశ్వసనీయ వర్గాల సమాచారం. తాజాగా పవన్ కల్యాణ్ ఢిల్లీ బయలుదేరి అమిత్ షాను కలవడం పొత్తుకు సంకేతంగా కనిపిస్తోంది. అయితే బీజేపీ-జనసేన పొత్తు ప్రధానంగా గ్రేటర్ పరిధిలోనే ఉండనుందని సమాచారం. ఈ లెక్కన ఐటీ కారిడార్‌లో కొన్ని సీట్లు జనసేనకు బీజేపీ కేటాయించనుందని ఆ పార్టీ నాయకుల విశ్వసనీయ సమాచారం. దీంతో ఆ నియోజకవర్గాల బీజేపీ ఆశావహులు నైరాశ్యంలో మునిగిపోయారు. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల నుంచి పదుల సంఖ్యలో ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పొత్తుపై ఢిల్లీ గ్రీన్ సిగ్నల్ ఇస్తే తమ భవిష్యత్తు ఏంటని బీజేపీ ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఏండ్ల నుంచి పార్టీ కోసం కష్టపడ్డామని అన్యాయం జరిగితే పార్టీలో ఉండబోమని నాయకులు చర్చించుకుంటున్నారు. అతీగతీలేని జనసేనతో పొత్తు కన్న స్వతహాగా బరిలో దిగితేనే డిపాజిట్లైనా దక్కుతాయని ఆ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. అధికార పార్టీ అభివృద్ధి నమూనాతో ఇప్పటికే గెలుపు ఖాయం చేసుకున్న పరిస్థితులు నియోజకవర్గాల్లో కనిపిస్తున్నాయని.. అభ్యర్థుల ఖరారులో ఆలస్యం చేస్తే పార్టీకి మరింత డ్యామేజీ చేకూరుతుందని ఢిల్లీ నాయకత్వంపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## జేఎన్‌టీయూలో ముగిసిన.. బీబీఏ-డాటా ఎనలైటికల్ ప్రవేశాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీబీఏ-డాటా ఎనలైటికల్ కోర్సులో ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. బీ టెక్ లేదా బీఫార్మా కోర్సులు చదువుతున్న విద్యార్థులు డ్యూయల్ డిగ్రీ కింద బీబీఏ కోర్సును ప్రవేశపెట్టారు. దీంతో ఆసక్తి కనబరిచే విద్యార్థులు ఉత్సాహంగా అడ్మిషన్లు పొందారు. అయితే బీబీఏ-డీఏ తరగతులు ఈ నెల 30 నుంచి ప్రారంభించనున్నట్లు బుధవారం యూనివర్సిటీ అధికారులు తెలిపారు. పూర్తి వివరాల కోసం 91542 51963 నంబర్ లేదా, జేఎన్‌టీయూ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.